
అయ్యప్ప మహాపూజలో ఎంపీ, ఎమ్మెల్యే



కీసర: అహ్మద్‌గూడ ప్రధాన రహదారి సమీపంలో (చీర్యాల మల్లన్న గుడి సమీపంలో) తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో శనివారం రాత్రి 7 గంటలకు 18 పడులతో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపూజలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ పడిపూజలో వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్షదారులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి అభినందనలు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ ఇబ్రహీంపట్నం మహిళా కళాశాల తెలుగు అధ్యాపకురాలు మృదులను.. కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పద్మమ్మ శనివారం అభినందించారు. తెలుగు అధ్యాపకురాలు మృదుల రచించిన '' లేడీస్ యూనిఫామ్'' రచనలు ప్రచురించబడ్డాయి. బహుళ మ్యాగజైన్‌తో పాటు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి కళాశాలకు బహుకరించిన పుస్తకాలను తెలుగు విభాగం వారికి అందజేశారు.

విజయోత్సవాలను జయప్రదం చేయాలి

కీసర: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఈ మేరకు నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో డిసెంబర్ 1 నుంచి 9వ తేది వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులను మరియు అర్బన్‌డే రోజువారి కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఫ్రెషర్స్ డే

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు ఫ్రెషర్స్ డే శనివారం ఘనంగా జరిగింది. లె-ఫీస్టా పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో విజయం సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం ప్రసాద్, డీన్ నాగరాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిహాక్ క్రీడా దినోత్సవం

పోచారం: కాచవానిసింగారంలోని నిహాక్ ఇంటర్నేషల్ స్కూల్‌లో 'ఎన్-గేమ్ ఛేంజర్స్' పేరుతో ప్రథమ క్రీడా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ వాలీబాల్ మరియు బీచ్‌బాల్ క్రీడాకారుడు ఎంసీఆర్ కృష్ణంరాజు, నల్ల నర్సింహారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి క్రీడా దినోత్సవం ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్రీడా రంగంలో రాణించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరించడం, కవాతులు, రేసులు, కసరత్తులు, కరాటే కిక్ ఆఫ్ షో నిర్వహించారు. ఎస్ఎన్ఆర్‌జీ వైస్ చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి, నిహాక్ స్కూల్ డైరెక్టర్లు సంపత్‌రెడ్డి, నల్లా సింధు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

మేడ్చల్‌రూరల్: ప్రభుత్వ రోడ్డు ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నారని మండలంలోని రావల్‌కోల్ గ్రామస్తులు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాణిక్యం తన ఇంటి నిర్మాణం కోసం రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు కలుగుతాయని వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌రూరల్: డ్రగ్స్ తయారు చేసి తరలిస్తున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులతో కలిసి టీజీ న్యాబ్ (యాంటీ నార్కోటిక్ బ్యూరో) పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ మేరకు శనివారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా కోరుకొల్లుకు చెందిన సత్యనారాయణ(43) కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. కుత్బుల్లాపూర్ పరిధి న్యూ షాపూర్‌నగర్‌లో నివాసం ఉంటూ సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఉన్న ఓ కెమికల్ కంపెనీలో ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. గత ఏడేళ్లుగా మెఫెడ్రోన్, ఎపిడ్రిన్ డ్రగ్స్ తయారు చేస్తున్నాడు. డ్రగ్ తయారీకి యాదగిరిగుట్టలో ఉన్న మూతపడిన యాదాద్రి లైఫ్ సైన్సెస్ కంపెనీ వినియోగించుకుంటున్నాడు. డ్రగ్ తయారు చేసిన తర్వాత కంపెనీ యజమాని వాసుదేవచారి అతడి స్నేహితుడు అయిన కృష్ణారెడ్డికి విక్రయిస్తున్నాడు. మరోవైపు డ్రగ్‌ను మార్కెటింగ్ చేయడంలో మహ్మద్ ఇస్మాయిల్, మచ్చ భానుప్రసాద్, చీపిరి సునీల్, అహ్మద్, మసూద్ బాధ్యులుగా ఉన్నట్టు గుర్తించారు. వారికి విక్రయించడంతో పాటు సత్యనారాయణ కూడా సొంతంగా డ్రగ్స్ వినియోగదారులకు విక్రయాలు జరుపుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ టీజీ న్యాబ్ అధికారులు, మేడ్చల్ పోలీసులతో కలిసి శుక్రవారం మేడ్చల్ పారిశ్రామికవాడ వద్ద నిఘా పెట్టారు. సత్యనారాయణ మేడ్చల్ చెక్‌పోస్టు మీదుగా మెఫెడ్రోన్ డ్రగ్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 1 కేజీ విలువగల డ్రగ్ స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్‌ను మార్కెటింగ్ చేయడంలో సహాయపడ్డవారంతా పరారీలో ఉన్నారని త్వరలో వారిని పట్టుకుంటామని డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్ విలువ రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సత్యనారాయణను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆహార నాణ్యతపై.. స్పెషల్ ఆఫీసర్లు..

- విద్యాసంస్థల్లో, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- మండల స్థాయిలో స్పెషల్ ఆఫీసర్‌లు
- జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ



విద్యాసంస్థల్లో తనిఖీలు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: విద్యా సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రుల్లో ఆహార నాణ్యత పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లను నియమించిన అధికార యంత్రాంగం వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు టాస్క్ ఫోర్స్ టీమ్‌ను రంగంలోకి దింపింది. రాష్ట్రంలోని పలు చోట్ల విద్యాసంస్థలు, హాస్టళ్లలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వంటి సంఘటనలతో ఆసుపత్రుల పాలైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే విద్యా సంస్థలు, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం మొదలు.. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆహార నాణ్యతపై నిఘాపెట్టారు. పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లతో సహా టాస్క్ ఫోర్స్ టీమ్ జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ఆహార నాణ్యతను తనిఖీ చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల వారీగా టాస్క్ ఫోర్స్ టీమ్‌లకు బాధ్యతలు అప్పగించిన జిల్లా యంత్రాంగం మండలాల వారీగా 15 మంది జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. జిల్లా స్థాయిలో కూడా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ టీమ్ ఏర్పాటైంది. ఈ టీమ్‌లో సభ్యులుగా డీఎంహెచ్ఓ డాక్టర్. రఘునాథ్‌స్వామి, డీఈఓ విజయకుమారి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ, అభివృద్ధి శాఖల జిల్లా అధికారి వినోద్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, మల్కాజిగిరి జిల్లా కేంద్రం ఆసుపత్రి డాకర్ సునీత, గురుకుల పాఠశాలల జిల్లా అధికారి రజనీకాంత్, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డా. మల్లీశ్వరి ఉన్నారు. స్థానికంగా కూడా విద్యా సంస్థలు, హాస్టళ్ల వారీగా కూడా టీమ్‌లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆహార నాణ్యతపై నిఘా..

విద్యార్థుల, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయంతోపాటు అత్యవసర పరిస్థితులలో సమర్థవంతమైన చర్యలను తీసుకునేందుకు ఈ టీమ్ అన్ని విధాలుగా వ్యవహరిస్తోంది. జిల్లాలో విద్యా సంస్థలు, ఎస్సీ, గిరిజన, బీసీ, మైనార్టీ, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించే బాధ్యతను ఈ టీమ్ చూసుకుంటోంది. ఈ టీమ్ అవసరమైతే ప్రతిరోజు భోజనం తయారు చేసే ముందు స్టోర్ రూమ్, వంట తర్వాత ఆహార నాణ్యత, ప్రమాణాల పాటిస్తున్నట్టు నిర్ధారించాల్సి ఉంటోంది. వంట వండిన తర్వాత ఆహార నాణ్యతను టీమ్ సభ్యులు రుచి చూసి పరిశీలించిన తర్వాత విద్యార్థులకు అందించాల్సి ఉంటోంది. ప్రతిరోజు ఈ బాధ్యతలను విధిగా పూర్తి చేయాల్సి ఉంటోంది.

తనిఖీల్లో స్పెషల్ ఆఫీసర్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో స్పెషల్ ఆఫీసర్లు విద్యా సంస్థలు, హాస్టళ్లలో ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు, 5 ఎస్సీ హైస్కూల్ హాస్టళ్లు, 7 కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. ఒక ఎస్సీ హైస్కూల్ హాస్టల్ ఉండగా, ఐదు కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. మైనార్టీశాఖ పరిధిలో 8 రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 12 కాలేజీ హాస్టళ్లు కొనసాగుతున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్ పాఠశాల, కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. వీటి అన్నింటిలో స్పెషల్ ఆఫీసర్లు శుక్రవారం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీలు నిర్వహించి తదుపరి మూడు రోజులు జిల్లా అధికార యంత్రాంగానికి ఆహార నాణ్యత తదితర విషయాలపై నివేదిక అందజేయాల్సి ఉంటోంది.





ప్రజలకు విద్య, వైద్యం అందించడమే లక్ష్యం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వజ్రేష్‌యాదవ్ తదితరులు

జవహర్‌నగర్: నిరుపేదలు నివసించే జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి సమీకృత రెసిడెన్షియల్ స్కూల్స్ కేటాయించినందుకు కృతజ్ఞతగా జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను సీఎం తీసుకువచ్చారన్నారు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తుందని, ప్రజలకు విద్యా, వైద్యం అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు, కరెంట్, గ్యాస్ వంటి పథకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, మేయర్ శాంతి, కార్పొరేటర్లు పల్లపు రవి, శ్రీనివాస్, సాయి, శ్రీకాంత్, వేణు, రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు వినయ్‌కుమార్, నాయకులు సదానందం, భాస్కర్, శ్రీనివాస్, రాజుయాదవ్, రమేష్‌చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు పండగ సభకు తరలివెళ్లిన నాయకులు



మేడ్చల్: మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం నిర్వహించిన రైతు పండగ మహాసభకు మేడ్చల్ నుంచి కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులలో ఇతర వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు, రైతులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శంకర్, రాజు, మండల ఏఈ అర్చన, మార్కెట్ కమిటీ అధికారులు తదితరులు వెళ్లారు.

సీఎం సభకు తరలివెళ్లిన రైతులు, నేతలు

కీసర: మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన రైతు పండుగ ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సీఎం బహిరంగ సభకు కీసర మండలం నుంచి పెద్ద ఎత్తున రైతులు, కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. ఈ మేరకు శనివారం కీసర రైతు వేదిక వద్ద మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు రెండు ఆర్టీసీ బస్సులకు జెండా ఊపి రైతులను సీఎం సభకు తరలించారు. కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రమేష్‌గుప్తా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, ఆంజనేయులు, నేతలు శివలింగాల శ్రీనివాస్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు సీఎం సభకు తరలివెళ్లారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని ప్రగతి ఎన్‌క్లేవ్‌లో సుమారు 8 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ సబితాంజనేయులుగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ పాలకవర్గం సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనుల నిమిత్తం సామాగ్రి కొనుగోలు చేయడం, శషాంక్ ఎన్‌క్లేవ్‌లో ఇంకుడుగుంతల ఏర్పాటు, మున్సిపల్ ఆటోలు, ట్రాక్టర్ల రిపేర్లకోసం, కీసర ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పలు రిపేర్లకోసం , తదితర పనుల కోసం మున్సిపల్ సాధారణ నిధుల నుంచి సుమారు రూ.29,38,000 నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మాణించడం జరిగిందన్నారు. సమావేశంలో కమిషనర్ నాగమణి, వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, మేనేజర్ వెంకటేశం, కౌన్సిలర్లు, కోఆప్షన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత భారత్‌ను నిర్మించాలి



వారోత్సవాల్లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అవినీతి రహిత భారత్‌ను నిర్మించడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఘనాపూర్ లింగాపురంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా పరిపాలనలో సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. అవనీతికి వ్యతిరేఖ పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనిత, నర్సింహ్మా, గోవర్ధన్, మల్లారెడ్డి, పవర్‌గ్రిడ్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

మండల మున్నూరుకాపు నూతన కమిటీ ఎంపిక



కీసర: కీసర మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా చిందం మహేందర్‌పటేల్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన ఉమ్మడి కీసర మండల మున్నూరుకాపు సంఘం సమావేశంలో అధ్యక్షులుగా మహేందర్‌పటేల్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా రమేష్, వ్యవస్థాపక అధ్యక్షులు సురేష్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు వెంకన్న, శ్రీధర్, క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ ఏనుగు వెంకటేశ్వర్లు, కో కన్వీనర్‌గా విష్ణు, ముత్తన్న, సలహాదారులుగా శ్రీనివాస్, కనుకయ్య, రవి, రాజన్న, ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా తోట నరేష్, ఆకుల భాస్కర్, శ్రీనివాస్, సుధాకర్, వెంకటేష్, కమలాకర్, కృష్ణ, శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా రాజయ్య, నరసయ్య, మహేందర్, సంయుక్త కార్యదర్శిగా నరేందర్, వీరేశం, రమేష్, నరసయ్య, రాజలింగం, కార్యవర్గ సభ్యులుగా నరేష్, సుధాకర్, రమేష్, నవీన్, నాగరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ ఎదుట నిరసనలు

- గురుకుల విద్యార్థుల మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే
- కాంగ్రెస్ ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోంది
- ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు శ్యామ్‌కిరణ్



ఘనాపూర్‌లో..

ఘట్‌కేసర్: గురుకుల సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మరణాలన్నీ ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేనని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు శ్యామ్‌కిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. గురుకుల హాస్టళ్లలో ఫుడ్ ఫాయిజన్ మరణాలకు నిరసనగా ఘనాపూర్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్ ఎదుట ఏబీవీపీ విద్యార్థులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలను సీఎం, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు ఎవ్వరూ పరామర్శించలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించాలని, లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఉప్పల్ జిల్లా కన్వీనర్ అఖిల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సచిన్, భాను, కార్తీక్, హరి, ఉపేందర్, ప్రశాంత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాలల బంద్

ఘట్‌కేసర్: రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో నాసిరకం ఆహారం తిని రోజుకో విద్యార్థి చనిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస ఘటనలకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సందీప్, అయాన్, వినయ్, రాజ్‌పుత్, మంజూర్, అమీర్, ఇమ్రాన్ ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన వామపక్ష విద్యార్థి నాయకులు, విద్యార్థులు

కమనీయంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం



స్వామివారికి క్షీరాభిషేకం



స్వామి దర్శనార్థం క్యూలైన్లలో భక్తజనం



శివలింగాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కీసర: కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం వేదపండితులు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల్ల పండువగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారికి (శివలింగానికి) ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం స్వామికి క్షీరాభిషేకం పూజను వైభవంగా నిర్వహించారు. స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు శివలింగాల వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. నేటితో కార్తీకమాస పూజోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. శనివారం పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాస పూజలు

ఘట్‌కేసర్: కార్తీక మాస పూజలు శనివారం ఘనంగా ముగిశాయి. నెల రోజులుగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని లింగాలకుంట సయ్యంభూ నాగలింగేశ్వర స్వామి ఆలయం, శివారెడ్డిగూడ శ్రీ భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం, అంకుషాపూర్, అవ్వుషాపూర్, ఎదులాబాద్ శ్రీ భ్రమారాంభిక సమేత మల్లికార్జున ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన, పత్రి, విభూతి, తులసి, పంచామృతంతో అభిషేకం చేశారు. ఎదులాబాద్ శివాలయంలో ఆదివారం ఉదయం రుద్రాభిషేకం, రుద్రహోమం, గణపతి హోమం అనంతరం అన్నదానం ఉంటుందని భక్తులు ప్రత్యేక పూజలకు హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. మాజీ ఉపసర్పంచ్ లింగేశ్వర్, అంజయ్య అన్నదానం చేయగా మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, శంకరప్ప, శివకుమార్, రాజేందర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో స్వామివారు



ఎదులాబాద్ శివాలయ ఆవరణలో అన్నదానం